క్లుప్తంగా

అమ్మవారి సేవలో లోకాయుక్త



అమ్మవారిని దర్శించుకుని వస్తున్న జస్టిస్ లక్ష్మణ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం లోకయుక్త జస్టిస్ లక్ష్మణ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు పబ్లిక్ గ్రీవెన్ రిడ్రెస్సల్ సిస్టం సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండి సంబంధిత సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చే అవకాశం కల్పించారు. గ్రీవెన్స్ వచ్చే ప్రజలు ఫిర్యాదు పత్రానికి కచ్చితంగా ఆధార్ జిరాక్స్ జత చేయాలని, అలానే ఫోన్ నంబర్ నమోదు చేయాలని కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



మాట్లాడుతున్న సీఐ మధుసూదన్

తిరుపతి(అలిపిరి): ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని.. పిల్లల విద్యాభివృద్ధికి.. యువతను మంచి మార్గంలో నడిపించేందుకు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని ఆర్‌పీఎఫ్ సీఐ మధుసూదన్ అన్నారు. ఆదివారం వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన గురుదేవోభవ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువుల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందించారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ ఫౌండర్ పైడి అంకయ్య, తుడా సెక్రటరీ వెంకటనారాయణ, బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి, చంద్రగిరి ఎంఈఓ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీనివాసుడు చిద్విలాసం



పురవీధుల్లో భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆసీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చిట్టిబాబు



తిరుపతి(అలిపిరి): తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గౌడపేరు చిట్టిబాబును నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో తిరుపతి నగర పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జాతీయ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి కల్చరల్: పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న విఘ్నేశ్వరుడు



తిరుపతి అర్బన్: వినాయక చవితి వేడుకల్లో కలెక్టర్, అధికారులు



ఈషా గణపతి ఆకారంలో వినాయక సాగర్‌లో కొలువై ఆకట్టుకుంటున్న వినాయకుడు



మూడో రోజు నిమజ్జనానికి ముస్తాబైన వినాయక సాగర్



తిరుపతి మంగళం: తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో..



గౌరీ తనయ.. మనసాస్మరామి

- టీటీడీ ఆలయాల్లో ఘనంగా వినాయక చవితి వేడుకలు
- తిరుపతి, చంద్రగిరిలో భారీగా వెలసిన గణనాథుడి ప్రతిమలు
- తుమ్మలగుంటలో ఆకట్టుకుంటున్న తమలపాకుల విఘ్నేశ్వరుడు
- భక్తిశ్రద్ధలతో లంబోదరుడికి పూజలు
- నేడు పలుచోట్ల నిమజ్జనం





తుమ్మలగుంటలో కొలువుదీరిన తమలపాకుల వినాయకునికి హారతి ఇస్తున్న అర్చకుడు, స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు

తిరుపతి కల్చరల్: టీటీడీ స్థానిక ఆలయాల్లో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకపిలేశ్వరాలయకంలో ఉదయం సుప్రభాతంతో శ్రీవినాయకకస్వామి వారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, అర్చన నిర్వహించారు. సాయంత్రం మూషిక వాహనంపై వినాయకుడికి గ్రామోత్సవం అత్యంత వేడుకగా చేపట్టారు. సర్వాంగ సుందరుడైన విఘ్నేశ్వరుడు పల్లకీలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ కృష్ణవర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో చవితి వేడుకలు

తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో వెలసిన శ్రీవినాయక స్వామి ఆలయంలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మూలవర్లకు అభిషేకం చేపట్టారు. అలాగే మొదటి ఘాట్ రోడ్డులో ఉన్న వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు.

తమలపాకు వినాయకుడు అద్భుతం

తిరుపతి రూరల్: ఏటా తుమ్మలగుంట గ్రామంలో వివిధ ఆకృతుల్లో దర్శనమిచ్చే గణనాథుడు ఈ ఏడాది చవితి నాడు తమలపాకులతో రూపొందించిన ప్రతిమను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 8 గంటలకు తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తమలపాకు వినాయకుడి ప్రతిమను ఆవిష్కరించి, గణపతి పూజలో పాల్గొన్నారు. 10 వేల తమలపాకులతో వినాయకుని ప్రతిమను అద్భుతంగా తీర్చిదిద్దారని భూమన ప్రశంసలు కురిపించారు. చెవిరెడ్డి కుటుంబం ఏ కార్యక్రమం చేపట్టిన భారీగా, విజయవంతంగా పూర్తి చేస్తారని అభినందించారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తమలపాకు వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వేదపాఠశాల పిల్లలతో పాటు పండితులు గణనాథునికి మంత్ర పఠనంతో పాటు కలశపూజ, గణపతి ఆరాధన, గణేశ శతనామావళి వంటి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.

సినీ ఆర్కిటెక్చర్ పర్యవేక్షణలో సెట్టింగ్ ఏర్పాటు..

అడవిలో తమలపాకు వినాయకుడు కొలువు దీరినట్లుగా హైదరాబాదు చలనచిత్ర రంగం నుంచి వచ్చిన ఆర్కిటెక్చర్ మురళి తన సిబ్బందితో కలసి భారీ సెట్టింగ్ ఏర్పాటు చేయించారు. ఆర్కిటెక్చర్ పర్యవేక్షణలో 10మంది కార్మికులు, 7 రోజుల పాటు శ్రమించి పదివేల తమలపాకులను ఉపయోగించి వినాయకుని ప్రతిమను తయారు చేశారు. పర్యావరణ రహితంగా బంకమట్టి, పేపర్ గుజ్జు, కాలుష్య రహిత రంగులతో చూడముచ్చటగా తయారైన తమలపాకు వినాయకుడు అందరినీ ఆకట్టుకుంటున్నారు. తమలపాకు వినాయకుని దర్శనార్థం వచ్చిన భక్తుల తాకిడికి తుమ్మలగుంట గ్రామంలో ఒక గంట సమయం ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు ఆయన ఇద్దరు కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి బాల వినాయక కమిటీ సభ్యులతో కలసి ఎటువంటి ఇబ్బందులు తెలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు.

కలెక్టరేట్‌లో..

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో వినాయక చవితి సందర్భంగా శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో పాటు డీఆర్వో పెంచల కిషోర్, డీఈఓ వి.శేఖర్, సమాచారశాఖ అధికారి బాలకొండయ్య పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. జిల్లా ప్రజలు సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గణనాథున్ని కోరుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో..

తిరుపతి మంగళం: తిరుపతి కపిలితీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శనివారం టాస్క్‌ఫోర్స్ ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎఫ్ఆర్‌ఓలు మురళి, ప్రేమ, ఆర్ఎస్ఐలు వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. ఆదిమూల గణపతి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.

విశేష రూపాల్లో విఘ్నేశ్వరుడు...

తిరుపతి కల్చరల్: జిల్లావ్యాప్తంగా ప్రజలు వినాయకున్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచారు. వాడవాడలా ప్రత్యేక మండపాల్లో వివిధ రూపాల్లో భారీ వినాయక విగ్రహాలు దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి ప్రసాదాల పంపిణీ, మధ్యాహ్నం అన్నదానాలు చేశారు. తిరుపతి నగరంలోని యాదవ వీధిలో ఆది పరాశక్తి రూపంలో, కొంకా వీధిలో మత్స్యకార అవతారంలో విఘ్నేశ్వరుడు కొలువు దీరి భక్తులను కటాక్షించారు. నెహ్రూనగర్‌లో అయోధ్య రామాలయం సెట్టింగ్‌లో గణపతిని కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. నిమ్మకాయల వీధిలో రాగిచెంబులతో, దొడ్డాపురం వీధిలో ప్రత్యేకంగా యాలకలతో రూపొందించిన వినాయకుడి ప్రతిమ. కోటకొమ్మల వీధిలో నాగు పాముల పడగలపై విష్ణువులా పవళించిన గణేశుడు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.



కోటకొమ్మల వీధిలో నాగ పడగలపై పవళించిన విష్ణుమూర్తి రూపంలో దర్శనమిస్తున్న గణేశుడు

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

వినాయక సాగర్‌లో నేటి నుంచి జరిగే నిమజ్జన ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజినీర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తుడా అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లు చేశారు. వినాయక సాగర్ కట్టపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 20 అడుగుల పొడవు, 40 వెడల్పుతో రూపొందించిన వినాయకుడి ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

భాకరాపేటలో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సుమారు 306 చోట్ల వినాయకుడి విగ్రహాలు కొలువుదీరాయి. ఆదివారం ఈ రెండు మండలాల్లో 47 చోట్ల వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లలో ప్రత్యేకంగా అలంకరించి నిమజ్జనానికి యువత కేరింతల నడుమ తరలించారు. పలుచోట్ల వినాయకుడి లడ్డూ వేలం వేయగా, భక్తులు పోటీ పడి లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.











తుమ్మలగుంటలో 10 వేల తమలపాకులతో తయారు చేసిన వినాయకుని విగ్రహాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన, అవిలాల: టెన్నిస్ కోర్టు వద్ద.., చవితి వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఎన్జీవో కాలనీ మహిళా భక్తులు, జై భోలో వినాయక మహరాజ్‌కీ అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జనం చేస్తున్న భక్తులు, నెహ్రూ వీధి వినాయక కమిటీకి లక్ష రూపాయలు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు పసుపులేటి రవి, వినయ్ రాయల్















భాకరాపేట : కురవపల్లెలో వినాయకున్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువత, వినాయక సాగర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ, అక్కారంపల్లిలోని ఎండీఆర్ లే అవుట్‌లో.., దొడ్డాపురం వీధిలో యాలకలతో దర్శనమిస్తున్న వినాయకుడు, నిమ్మకాయల వీధిలో రాగి చెంబులతో రూపొందించిన వినాయకుడి విగ్రహం, యాదవ వీధిలో ఆదిపరాశక్తి రూపంలో కొలువై దర్శనమిస్తున్న వినాయకుడు, వినాయక సాగర్ వద్ద నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లు

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

తిరుపతి తుడా: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. విజయవాడను వరద ముంచెత్తిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అక్కడ సహాయక చర్యలు చేపట్టేందుకు గత బుధవారం రాత్రి కమిషనర్ ఆధ్వర్యంలో 80 మంది పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్, హెల్త్ అధికారులు వెళ్లారు. విజయవాడ 15వ డివిజన్‌లోని రామలింగేశ్వర్ కట్ట, రంజిత్ భార్గవ్ రోడ్డు, గాంధీ కాలనీ, ఈనాడు కాలనీ, శివశంకర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే సహాయక చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి కాలువల్లో పేరుకుపోయిన బురద, చెత్త తొలగింపు, వర్షపు నీటిని తొలగిస్తున్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి, ఫాగింగ్ చేయిస్తున్నారు. శని, ఆదివారాల్లో జోరువర్షం కురుస్తున్నా, సిబ్బంది మాత్రం పనులు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి బాధితులకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నారు. సహాయక చర్యల్లో ప్రజా ఆరోగ్యాశాఖధికారి డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈలు సంజయ్ కుమార్, మహేంద్రరాజు, నరేంద్ర, రవీంద్ర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

గరికపాటి రాజారావుకు నివాళి



గరికపాటి రాజారావుకు నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్య మండలి, ప్రజాసంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: కళ ప్రజల కోసమని నమ్మి సమాజ హితం కోరుతూ ప్రజా చైతన్యం వైపు అడుగులేసి ఎందరో కళాకారులను సినిమా రంగానికి అందించిన ప్రజా నాట్య మండలి వ్యవస్థాపకుడు డాక్టర్ గరికపాటి రాజారావు ఆశయాలను కొనసాగిద్దామని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు. ఆదివారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో డాక్టర్ గరికపాటి రాజారావు 61వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజానాట్య మండలి నేతలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజారావు తన జీవితం మొత్తం ఆలోచనలతో రచనలు చేశారన్నారు. ఆయన డాక్టర్‌గా పేదలకు ఉచిత వైద్యంతో పాటు ఉచితంగా మందులు కూడా సరఫరా చేసేవారని తెలిపారు. సమాజంలో ఉన్న రుగ్మతులను, మూఢ నమ్మకాలను రూపుమాపాలంటే కళ అనే ఆయుధంతో ప్రజలను చైతన్యవంతం చేయవచ్చని నమ్మి అనేక మంది కళాకారులను తయారు చేసి నాటక రంగాన్ని ఏర్పాటు చేశారన్నారు. అందులో మోహన్‌దాస్, టి.చలపతిరావు, బుర్రకథ ప్రముఖులు నాజర్ వంటి కళాకారులను వెలుగులోకి తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ప్రజాసంఘాల నేతలు అభ్యుదయ వేదిక అధ్యక్షుడు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ జయచంద్ర

ఏర్పేడు: రికార్డులులేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. మండలంలోని వికృతమాల నీలాద్రి అపార్ట్‌మెంట్స్, టిడ్కో గృహాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో లైసెన్స్‌లు, రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనాలపై కొందరు వెళుతున్నట్లు గుర్తించామన్నారు. రికార్డులు లేని 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రికార్డులు, లైసెన్స్‌లు లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రంకెలేసిన కోడెగిత్తలు

- ఉరకలేసిన యువకులు
- గంగుడుపల్లిలో జనజాతర
- పరుష పందేలను తిలకించేందుకు వేలాదిగా వచ్చిన ప్రజలు
- కోడెగిత్తలకు మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఫొటోలతో కూడిన పలకలు
- జోష్ నింపిన జల్లికట్టు



మాజీ సీఎం జగన్ చిత్రంతో కూడిన బొమ్మతో పరుగులు తీస్తున్న ఎద్దు

చంద్రగిరి: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని గంగుడుపల్లిలో ఆదివారం పరుష పందేలు నిర్వహించారు. వేడుకలను తిలకించడానికి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పశువులకు నల్లని దారాన్ని నడుముకు కట్టి, బుడగలు, పుష్పాలతో వాటిని అందంగా అలంకరించి, కొమ్ములకు పలకలను కట్టి బరిలోకి దింపారు. ఆవులు, ఎద్దులు, కోడెగిత్తలను గుంపులు గుంపులుగా పరుగులెత్తించారు. జోరుగా దూసుకొచ్చే కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. పలకలను సొంతం చేసుకునేందుకు ఎగపడ్డారు. జల్లికట్టులో గెలుపొందిన వారు పలకలను చూపుతూ విజయగర్వంతో ఊగిపోయారు. జల్లికట్టు సందర్భంగా గంగుడుపల్లికి జనం పోటెత్తారు. దీంతో వాహన రాకపోకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పండింది.

పందెం కాసిన పలువురు..

పరుష పందేరాల్లో భాగంగా పశువుల యజమానులు తమ కోడెగిత్తలను అదుపు చేయడంపై పెద్దఎత్తున పందేలను కాశారు. తన ఎద్దును అదుపు చేసిన వారికి రూ.10 వేలను బహుమతిగా ఇస్తానంటూ వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మగుంట రవి పందెం కాయగా, మరికొందరు పట్టువస్త్రాలు, నగదును పందెంలో పెట్టారు.

పలువురికి గాయాలు..

కోడెగిత్తలను అదుపు చేసే సమయంలో పలువురు యువకులు గాయపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి పరుష పందేలను చూడడానికి వచ్చిన జనాలపైకి కోడెగిత్తలు దూసుకెళ్లడంతో స్వల్పగాయాలయ్యాయి. కొంతమంది యువకులను ఎద్దు కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. దీంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరో వ్యక్తికి ఎద్దును అదుపు చేసే క్రమంలో కాలు విరిగింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి గ్రామస్తులు అన్నదానంతో పాటు ఇతర శీతల పానీయాలను ఉచితంగా అందజేశారు.

ప్రత్యేక ఆకర్షణగా ఆర్‌ఆర్ యూత్ ర్యాలీ..

పరుష పందేల సందర్భంగా తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ వైఎస్సార్‌సీపీ శ్రేణులలో నూతనోత్సాహం నింపింది. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కూడిన పలకలను ఎద్దులకు కట్టి భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఈ పందేలు వైఎస్సార్‌సీపీలో ప్రత్యేక జోష్‌ను నింపింది.



పరుష పందేరాలకు సిద్ధమవుతున్న పశువులు



జనసంద్రంగా మారిన గంగుడుపల్లి



పరుష పందేలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఆర్‌ఆర్ యూత్ ర్యాలీ